

ఇద్దరు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసు: ఆర్ఐవో

కలెక్టరేట్, మార్చి 5: ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు ఆర్ఐవో ఎం.ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరిగింది. 73 కేంద్రాల్లో 19,852 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 19004 మంది పరీక్ష రాశారు. వంగరలో ఒక విద్యార్థిని, కొత్తవలసలో మరో విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు ఆర్ఐవో తెలిపారు.

రూ.5 కోట్ల భూమి కబ్జా!



విజయనగరం-పాలకొండ రోడ్డులో వేణుగోపాలపురం రెవెన్యూలో అనధికారికంగా చదును చేస్తున్న స్థలం ఇదే

- విలువైన స్థలాలపై అధికార పార్టీ నేతల కన్ను
- దర్జాగా ఆక్రమణ.. గుర్తించిన రెవెన్యూ శాఖ
- అధికారులు తాత్కాలికంగా అడ్డుకుని ఆపై వదిలేసిన వైనం
- నేటికీ చదును చేయిస్తున్న వ్యక్తులు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

విజయనగరం శివారున పాలకొండ రోడ్డులో ఉన్న అత్యంత విలువైన స్థలమది. సుమారు రూ.5 కోట్లు ఉంటుంది. ఖాళీగా ఉండడంతో అధికార పార్టీ నేతల కన్ను పడింది. అంతే రాత్రికి రాత్రి చదును చేసేస్తున్నారు. ఈనెల ఒకటి, రెండు తేదీల్లో రాత్రి వేళ చదును చేశారు. ఉదయం 5 గంటల తర్వాత అక్కడ ఎవరూ కనిపించేవారు కాదు. చదును చేసిందెవరో తెలియకుండా కథ నడిపించారు. ఈనెల 3న ఈ స్థలం కబ్జా చేస్తున్నారంటూ విజయనగరం, నెల్లిమర్ల పట్టణాల్లో ఒక్కసారిగా గుప్పుమంది. దీంతో రెవెన్యూ శాఖ ఈనెల 3న ఆ స్థలాన్ని పరిశీలించింది. ఆ భూమి 22ఏ పరిధిలో ఉన్నట్లు గుర్తించింది. కాగా భూమిని చదును చేస్తున్న వ్యక్తి అజ్ఞాతంలో ఉంటూ కూలీలతో సమాధానం చెప్పిస్తున్నట్లు సమాచారం. వీఆర్‌ఓ కుమారస్వామి పరిశీలించి పనులు చేపట్టవద్దని ఆదేశించారు. అయితే ఇంత జరిగాక కూడా మంగళవారం యథావిధిగా పనులు చేపట్టి భూమిని చదును చేస్తుండడం గమనార్హం.

దీని వెనుక కీలక రెవెన్యూ సిబ్బంది, అధికార పార్టీ నేతల హస్తం ఉందన్న ప్రచారం విజయనగరం, నెల్లిమర్ల పట్టణాల్లో కోడై కూస్తోంది. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని చదును చేస్తున్నా ప్రభుత్వ ఆస్తిని కాపాడేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రధాన మార్గాన్ని ఆనుకుని ఉన్న ఈస్థలంపై ఇన్నాళ్లూ ఎవరూ దృష్టిసారించలేదు. ప్రస్తుతం ఎన్నికల విధుల కోసం తాత్కాలికంగా వచ్చిన తహసీల్దార్లు, డీటీలు కూడా పట్టించుకోవటం లేదు. తాముండే కొద్ది నెలలు వివాదాల జోలికి పోరాదన్న దృక్పథంతో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని గుర్తించిన ఆక్రమణదారులు రెచ్చి పోతున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కన్పిస్తే అక్కడ వాలిపోతున్నారు. తప్పుడు రికార్డులు, డాక్యుమెంట్లు సృష్టించి చాలా చోట్ల కబ్జాకు తెగబడుతున్నారు.

● చదును చేస్తున్న స్థలంపై ఉన్న ఆధారాలు ఏమిటో తీసుకు రావాలని కోరుతున్నప్పటికీ తహసీల్దార్ వద్దకు ఆయా వ్యక్తులు రావటం లేదని వీఆర్‌ఓ చెబుతున్నారు. దీని వెనుక పెద్ద కథే నడుస్తున్నట్లు తెలుస్తోంది. అజ్ఞాతంలో ఉంటూ అధికార యంత్రాంగం, అధికార పార్టీ కీలక నేతలతో కథ నడుపుతున్నట్లు సమాచారం.

● రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రస్తుతం చదును చేస్తున్న స్థలం విజయగనగరం కార్పొరేషన్ 1వ డివిజన్ పరిధిలో ఉంది. వేణుగోపాలపురం రెవెన్యూలోని 59 సర్వే నెంబరులో ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం 22ఏలో ఉంది. అయితే చదును చేస్తున్న ప్రబుద్ధులు పొరపాటున 22ఏలో తమ భూమి పడినట్లు ప్రచారం చేస్తున్నారు. అదే నిజమైతే ఆధారాలు చూపాల్సి ఉంది. అధికారుల వద్దకు వెళ్లకుండా యథావిధిగా భూమిని చదును చేయిస్తున్నారు.

● భూ వ్యవహారంలో తహసీల్దార్ తరువాత కేడర్ ఉద్యోగి కీలకంగా ఉంటూ రెవెన్యూ లోసుగులు వివరిస్తూ కథ నడిపిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ మార్గం గుండా నిత్యం మంత్రి బొత్స, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వెళుతుంటారు. నెల్లిమర్ల, విజయనగరం ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రాలను ఆనుకుని ఈ స్థలం ఉండటం గమనార్హం.

● కబ్జా అంశాన్ని విజయనగరం తహసీల్దార్ రత్నం వద్ద ప్రస్తావించగా తాను కొత్తగా వచ్చానని, దీనిపై వివరాలు తెలుసుకుంటానని వెల్లడించారు. వీఆర్‌ఓ కుమార స్వామి వద్ద ప్రస్తావించగా చదును చేస్తుండడాన్ని పరిశీలించానని, 22ఏలో ఉందని అన్నారు. చదును చేస్తున్న వారు ఆధారాలను తీసుకుని తహసీల్దార్ వద్దకు రావాలని కోరామన్నారు. అంతవరకు ఎటువంటి పనులను చేపట్టవద్దని సూచించామని తెలిపారు.

ఇదేం హక్కు?

- లబ్ధిదారులకిచ్చే శాశ్వత ఇంటి స్థలం హక్కు పత్రాలపై మెలిక
- పదేళ్ల దాకా అమ్ముకోడానికి లేదన్న ప్రభుత్వం
- నిరాశ వ్యక్తం చేస్తున్న పేదలు

బొబ్బిలి, మార్చి 5: జగనన్న ఇంటి స్థల హక్కు పత్రాలపై ప్రభుత్వం పెట్టిన మెలికను లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పదేళ్ల దాకా అమ్ముకోడానికి వీలులేదంటే ఎలా అని అడుగుతున్నారు. శాశ్వత హక్కులు కల్పిస్తూ అందజేసే ఒక్కో పత్రానికి రూ.4,100 రిజిస్ట్రేషన్ ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తోందని చెబుతున్నా షరతును అందరూ వ్యతిరేకిస్తున్నారు. అలాంటప్పుడు పూర్తి హక్కులు ఇచ్చినట్లు ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. కొన్ని నెలల కిందట ప్రభుత్వం ఓటీఎస్ పథకాన్ని తెరపైకి తెచ్చింది. ఇంతవరకు రిజిస్ట్రేషన్ కాని ఇళ్ల కోసం అని చెబుతూ పట్టణ ప్రాంతాల్లో రూ.15 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు చొప్పున వసూలు చేసింది. ఆ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలపై బ్యాంకు రుణాలు వస్తాయని నమ్మబలికింది కాని ఎక్కడా బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. పైగా వాటినీ పదేళ్ల వరకు అమ్ముకోవడానికి వీలు లేకుండా హక్కు పత్రాలు జారీ చేశారు.

రిజిస్ట్రేషన్ తరువాత ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్) ఇస్తున్నా బ్యాంకులు రుణాలిచ్చేందుకు ససేమిరా అంటున్నాయి. ఇదెక్కడి విడ్డూరం అని లబ్ధిదారులు వాపోతున్నారు. పేదలకు అత్యవసరం వచ్చినప్పుడు ఇళ్లపై బ్యాంకు రుణాలు వాడుకోవడానికి లేదా అమ్ముకోవడానికి వెసులుబాటు కల్పించకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ఇళ్ల స్థలాలు పొందిన వారిలో చాలా మంది వాటిని అమ్మేసుకున్నారు. ప్రామిసరీ నోటుపై హామీ రాసుకుని విక్రయించేశారు. అలాంటి వారికి శాశ్వత హక్కుపత్రాలు ఇచ్చినా ప్రయోజన శూన్యమే. పైగా ఇళ్లను కొనుగోలు చేసుకున్న వారి నుంచి మరోసారి ఈ హక్కుపత్రాలు చూపుతూ అదనపు మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



చూసి సంబర పడడానికే హక్కు పత్రం

ఓటీఎస్ పథకంలో నేను ఇళ్ల రుణం కింద డబ్బులు చెల్లించాను. రెండేళ్లు గడిచింది. రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. దానిపై బ్యాంకు రుణం వస్తుందని చెబితే బ్యాంకుల చుట్టూ తిరిగాను. ఏ బ్యాంకు రుణం ఇవ్వమని కరాఖండిగా చెప్పేశారు. అలాంటప్పుడు శాశ్వత హక్కుపత్రం చూసి సంబరపడడానికి పని కొస్తుంది తప్ప అవసరానికి పనికిరావడంలేదు.

- ఆదినారాయణ, లబ్ధిదారుడు, బొబ్బిలి

పైడిమాంబ ఆలయంలో చండీయాగం

- ఇక నుంచి ప్రతి మంగళవారం ఆధ్యాత్మిక ప్రదర్శనలు



విజయనగరం రూరల్, మార్చి 5: పైడి తల్లమ్మ వనంగుడిలో మంగళవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని చండీయాగం నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఓ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలుతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చదురు గుడిలో కూడా వివిధ రకాల పూలతో పైడిమాంబను అలంకరించారు.

● పైడిమాంబ చదురుగుడి ఎదురుగా ఖాళీ స్థలంలో ప్రతి మంగళవారం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. భక్తి గీతాలు, ప్రవచనాలు, సంగీత కచేరీలు వంటివి నిర్వహించనున్నారు. ఏటా సిరిమానోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు నిర్వహించే ఈ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఈ రోజు నుంచి ప్రతి మంగళవారం ఏడాది పొడవునా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింట్‌డెంట్ ఏడుకొండలు, ఆధ్యాత్మిక సేవా సంఘం నిర్వాహకుడు ఆర్.సూర్యపాత్రో తదితరులు పాల్గొన్నారు.

మాకు పార్టీ ముఖ్యం

- వైసీపీ నేతలకు తెగేసి చెబుతున్న టీడీపీ నేతలు
- అసంతృప్తులకు గాలం వేస్తున్న అధికార పార్టీ
- వచ్చేది లేదంటున్న తమ్ముళ్లు



విజయనగరం (ఆంధ్రజ్యోతి)

అసంతృప్తులే.. లక్ష్యంగా వైసీపీ పావులు కదుపుతోంది. టీడీపీలో ఎమ్మెల్యే సీటు దక్కని వారిని లక్ష్యంగా చేసుకుని బలం పెంచుకునే వ్యూహం రూపొందించింది. పదవుల ఆశ చూపి వైసీపీలోకి రమ్మంటోంది. తమ్ముళ్లు మాత్రం తమకు పార్టీయే ముఖ్యమని తెగేసి చెబుతున్నారు. వచ్చేదిలేదంటున్నారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఇప్పటికే విజయనగరం, బొబ్బిలి, రాజాం, గజపతినగరం, నెల్లిమర్ల సీట్లకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసింది. అప్పటి నుంచి ఆయా అభ్యర్థులు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' పథకాలతో ప్రజల్లోకి వెళ్లడం.. సూపర్ సిక్స్ హామీలను ఒక వైపు వివరిస్తూనే.. మరో వైపు సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు. అయితే సీటు ఆశించి భంగపడ్డ వారిని, అనుచరులకు వైసీపీ గాలం విసురుతోంది. విజయనగరం, గజపతి నగరం, నెల్లిమర్ల టీడీపీ సీట్లను పలువురు ఆశించారు. సీటు దక్కకపోవడంతో వారంతా కొంత అసంతృప్తితో ఉన్నారు. వారిని చేరదీసే ప్రయత్నంలో వైసీపీ ఉంది. పార్టీ అధిష్ఠానం నుంచి కీలకమైన వ్యక్తులు వారికి ఫోన్ చేసి.. తమ పార్టీలోకి వస్తే సముచిత స్థానంతో పాటు నామినేటెడ్ పోస్టులు ఇస్తామని ఆశపెడుతున్నారు. మరికొంతమంది నాయకులకు తాయిలాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

● గజపతినగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో కొంతమంది చోటామోటా నాయకులకు వైసీపీ నేతలు వల వేస్తున్నారు. తాయిలాలు, పదవులపై హామీలు ఇచ్చి వారిని ఎలాగైనా తమ వైపు తిప్పుకుని ఓటుబ్యాంక్‌ను కొల్లగొట్టాలని చూస్తున్నారు. అయితే వాటిని టీడీపీ నాయకులు తిప్పికొడుతున్నారు. 'మీకో దండం..మీ పార్టీకో దండం..ఓడినా..గెలిచినా టీడీపీలోనే ఉంటాం' అని ఖరాకండిగా చెబుతున్నారు. 'వచ్చేదే టీడీపీ ప్రభుత్వమేనని, మీరే టీడీపీలో చేరండని' మొహం మీదే చెబుతున్నారని తెలిసింది. అయినా వైసీపీ నేతలు ప్రయత్నాలు మానడం లేదు. టీడీపీలోని ద్వితీయ, తృతీయ శ్రేణులకు టచ్‌లో(ఫోన్ ఇన్) ఉంటున్నారు.

60 రోజులకే బదిలీ

- అధికార పార్టీ ఆగ్రహానికి గురైన మున్సిపల్ డీఈఈ



కనకరాజు, డీఈఈ

బొబ్బిలి, మార్చి 5: అధికార పార్టీ ఆగ్రహానికి గురైతే ఏమవుతుందో మరోసారి రుజువైంది. బొబ్బిలి మున్సిపాలిటీలో డీఈఈగా చేరిన కనకరాజుకు 60 రోజులకే మళ్లీ బదిలీ అయింది. రాష్ట్ర ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపాలిటీకి ఆదేశాలొచ్చాయి. డీఈఈని ఎలాగైనా పంపించేయాలని అధికార పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు పావులు కదిపారు. ఇందులో కాంట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. డీఈఈని బదిలీ చేయాలన్న కొంతమంది డిమాండ్‌ను మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు కాదనలేక పోయారని సమాచారం. ఆయన సమక్షంలోనే పలు దఫాలు తీవ్ర వాదోపవాదనలు జరిగాయి. ప్రతిపక్షానికి చెందిన కౌన్సిలర్లు మాట్లాడితే వారిపై ఒంటికాలిపై నిలబడి ఎదురుదాడి చేసే ఛైర్మన్ వైసీపీ కౌన్సిలర్ల విషయానికి వస్తే మౌనముద్ర దాల్చుతారన్న అపవాదు ఉంది.

● బొబ్బిలిలో రూ.4 కోట్లతో చేపట్టిన రోడ్లు, కాలువల నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందన్న ఆరోపణ ఉంది. వాటిలో రూ.80 లక్షల మేర ప్రతిపాదించిన పనుల్లో సుమారు రూ.40 లక్షల వరకు చెల్లింపులు జరిగిపోయాయి. మిగిలి ఉన్న బిల్లులకు సంబంధించి సుమారు రూ.20 లక్షల వరకు కొత్తగా వచ్చిన డీఈఈ అభ్యంతరం తెలిపారు. రెండు పంపు సెట్లను కొనుగోలు చేసిన వ్యవహారంలో ఐదు కొనుగోలు చేసినట్లు బిల్లులు పెట్టాలని నేతలు కోరగా అందుకు డీఈఈ ససేమిరా అన్నట్లు తెలిసింది. దీంతో ఆయనపై సంబంధిత వర్గాల వారు గుర్రుగా ఉన్నారు. ఆ క్రమంలోనే తాజా బదిలీ జరిగి ఉంటుందని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

పరిపాలనాంశాల కారణంతోనే బదిలీ

లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి

మున్సిపల్ డీఈఈ కనకరాజును ఈఅండ్‌సీలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. పరిపాలనాంశాల కారణాలతోనే ఆయనను బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజకీయపరమైన అంశాల గురించి మాకు తెలియదు. ఉన్నతాధికారుల ఉత్తర్వులను పాటించడమే మా కర్తవ్యం.

చిక్కితే తుక్కే..

- పోలీస్‌స్టేషన్లలో ఉండిపోతున్న వాహనాలు
- ఎండ, వాన ప్రభావంతో పాడవుతున్న వైనం



రాజాం రూరల్, మార్చి 5: పొరపాటునో, గ్రహపాటునో పోలీసులకు వాహనం చిక్కితే వాటిపై ఆశలు వదులుకోవాల్సిందే. ప్రమాదవశాత్తు కావచ్చు.. నిషేధిత వస్తువుల రవాణా చేస్తూనో లేదా దొంగిలించింది అయినా కావచ్చు.. కారణం ఏదైనా వాహనాలు స్టేషన్ ప్రాంగణానికి వెళ్తే ఇక అంతే.. ఎండకు ఎండి వానకు తడిసి తుక్కుపట్టాల్సిందే. జిల్లా అంతటా ఇలాంటి పరిస్థితే ఉంది. హైవేలో ప్రమాదాల తీవ్రత ఎక్కువ. విజయనగరం కేంద్రంగా అటు విశాఖ, ఇటు శ్రీకాకుళం, మరోవైపు బొబ్బిలి, రాజాం తదితర మార్గాలలో ద్విచక్ర వాహనం మొదలుకొని కార్లు, లారీలు, ట్యాంకర్లు ఇలా చాలా వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. చిన్నపాటి ప్రమాదాలైతే రాజీమార్గంలో స్టేషన్ వరకూ వెళ్లకుండానే సర్దుబాటు చేసుకుంటున్నారు. భారీ ప్రమాదాలు, మరణాలు సంభవించిన పరిస్థితుల్లో పోలీస్ కేసులు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాహనాలు స్టేషన్‌కు చేరుతున్నాయి. ఆ తర్వాత అవి రూపు కోల్పోతున్నాయి.

కేసులు తేలక కొన్ని..

ప్రమాదాలకు గురైన వాహనాలు ఏళ్ల తరబడి కేసులు పూర్తికాక స్టేషన్లలో ఉండిపోతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో అయితే వాహన యజమానులకు జరిమానా విధించినప్పుడు న్యాయస్థానాల్లో జరిమానా చెల్లించి వాహనాలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే అప్పటికే వాహనం తుక్కుతుక్కుకావడంతో జరిమానా చెల్లించే కన్నా వాహనాన్ని విడిచిపెట్టడమే మేలన్న ఆలోచనతో వదిలేస్తున్నారు. అలాగే గంజాయి, అక్రమంగా మద్యం, ఇతరత్రా సరుకుల రవాణా సమయాల్లో వాహనాలు పట్టుబడుతున్నాయి. అనుమానాస్పదమైనా, సరైన ధ్రువపత్రాలు లేకపోయినా ఆ వాహనాలను విడిచిపెట్టి పలాయనం చిత్తగిస్తున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకుంటున్న ఆ వాహనాలు కూడా చివరకు తుక్కుగా మారుతున్నాయి.



రాజాం పోలీస్‌స్టేషన్ ఆవరణలోని వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక (ఫైల్)

జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఇలాంటి వాహనాలు వందల సంఖ్యలో ఉన్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రంతో పాటు బొండపల్లి, గజపతినగరం, రామభద్రపురం, బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్ల, పూసపాటిరేగ, ఎస్.కోట, కొత్తవలస స్టేషన్లలో వీటి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. కారణాలేమైనా వాహనాలు మాత్రం స్టేషన్ల పరిధిలో తుక్కుగా మారిపోతున్నాయి. ఎండకు ఎండి వానకు తడిసి ఎటూ పనికిరాకుండా పోతున్నాయి. ఆయా స్టేషన్‌హౌస్ అధికారులు సైతం వీటిని సంరక్షించే చర్యలు చేపట్టడం లేదు. ఇదిలా ఉండగా పోలీస్‌స్టేషన్ ప్రాంగణానికి చేరుకున్న వాహనాల బ్యాటరీలు, హారన్లు, ఇంజన్‌లోని విలువైన పరికరాలతో పాటు ఇతరత్రా మెటీరియల్ మాయమవుతున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. కారణం ఏమిటన్నదానిపై అనేక భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి.

నిబంధనలిలా..

నిబంధనల ప్రకారం ఒక వాహనం ప్రమాదవశాత్తు గాని, స్వాధీనం చేసుకున్నది గాని, దొంగిలించింది గాని పోలీసులకు చిక్కితే స్టేషన్‌కు తరలిస్తారు. వీటిని సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయాలకు సమాచారమివ్వాలి. బహిరంగ ప్రకటన విడుదల చేసి ఆరు నెలల అనంతరం వేలం వేస్తారు. అయితే ఇలా ఎక్కడా జరగడం లేదన్న ఆరోపణలున్నాయి. కాగా ప్రమాదం జరిగిన వాహనాన్ని తిరిగి వాడేందుకు కూడా చాలామంది యజమానులు ఇష్టపడడంలేదు. ఫలితంగా స్టేషన్లలో వాహనాలు పేరుకుపోతున్నాయి.

మాక్ డ్రిల్‌కు సన్నద్ధం

కలెక్టరేట్: మైలాన్ లేబొరేటరీస్ వద్ద ఈ నెల 7న నిర్వహించనున్న రసాయనిక విపత్తుల (కెమికల్ డిజాస్టర్)పై మాక్ డ్రిల్ కోసం సర్వం సిద్ధంగా ఉన్నట్లు నోడల్ అధికారి, ఆర్డీవో సూర్యకళ తెలిపారు. మాక్‌డ్రిల్‌పై ఫ్యాక్టరీస్ డైరెక్టర్ వర్మ, స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ కూర్మనాథ్ 17 జిల్లాల నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పూసపాటిరేగ మండలం చోడవరం వద్ద నున్న మైలాన్ ల్యాబ్స్ వద్ద 7న ఉదయం 9 గంటల నుంచి మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. చోడమ్మ అగ్రహారం నుంచి 60 మందిని ఖాళీ చేయించడానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. బాధితులకు చికిత్స కోసం దగ్గరలో ఉన్న ఆసుపత్రిని గుర్తించామని వెల్లడించారు.

8న సహస్ర లింగాల దివ్య దర్శనం

కలెక్టరేట్: మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 8న నగరంలోని అయోధ్య మైదానం(ఎంఆర్ కళాశాల గ్రౌండ్)లో సహస్ర లింగాల దివ్య దర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల ఇన్‌చార్జి రాజయోగిని బీకే అన్నపూర్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కంటోన్మెంట్ సేవా కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని 8వ తేదీ సాయంత్రం ఐదు నుంచి రాత్రి 10 గంటల వరకూ సహస్ర లింగాల దివ్య దర్శనం ఉంటుందని వెల్లడించారు.

గుమ్మనూరు పార్టీ మారడం దురదృష్టకరం

రామభద్రపురం: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మంత్రి పదవికి, వైసీపీకి రాజీనామా చేయడం దురదృష్టకరమని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. కొట్టక్కి గ్రామంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతో ఆయన బంధువులకు మొదటి నుంచి సంబంధాలు ఉండడంతో పార్టీని వీడినట్టు తెలిపారు. ప్రజలంతా వైసీపీతోనే ఉన్నారని అన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం క్రైం: నగరంలో మోటారు వాహనాల దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ వెంకటరావు అన్నారు. కణ పాకలో ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపార్టుమెంట్లలో పార్కింగ్ చేసే మోటార్ సైకిళ్లకు పెట్రోల్ లాక్స్, హ్యాండిల్ లాక్స్ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిని మేనిఫెస్టోల్లో చేర్చాలి

రేగిడి: వ్యవసాయానికి ఉపాధి హామీ పథకం వర్తింపజేస్తామని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చాలని ఏపీ రైతు సంఘ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు నారు జనార్దనరావు మంగళవారం రేగిడి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు కూలీల కొరత తీర్చే ఉపాధిని వ్యవసాయానికి వర్తింపజేయాలన్నారు.

మిమ్స్ ఉద్యోగుల రాస్తారోకో

నెల్లిమర్ల: తమ సమస్యలు పరిష్కరించాలని మిమ్స్ ఉద్యోగులు కొద్దిరోజులుగా నిరసన దీక్ష చేపడుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం వారు స్థానిక డైట్ జంక్షన్‌లో కొద్దిసేపు రాస్తారోకో చేశారు. తక్షణమే కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకోవాలని నినదించారు. అనంతరం వారి దీక్ష శిబిరానికి వైసీపీ, ప్రజా సంఘాల నాయకులు చేరుకుని సంఘీభావం తెలిపారు.

బ్లడ్ బ్యాంకు ప్రారంభం

చీపురుపల్లి: చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన బ్లడ్ బ్యాంకును విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. బ్లడ్ బ్యాంకు నిర్మాణం కోసం అరవిందో ఫార్మా ఫౌండేషన్ సంస్థ సీఎస్సార్ కింద రూ.86 లక్షలు సమకూర్చింది. దీనిలో రూ.50 లక్షలతో భవనం, రూ.36 లక్షలతో పరికరాలు సమకూర్చారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, డీసీహెచ్ఎస్ గౌరీశంకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ నాయక్ పాల్గొన్నారు.

సమాన హక్కులు ఉండాలి

రాజాం: అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులు ఉండాలని జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ అవనాపు భావన అన్నారు. మంగళవారం జీఎంఆర్ఐటీ ప్రాంగణంలో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, నాబార్డు సంయుక్తంగా నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర రిసోర్స్‌పర్సన్ టి.సుధారాణి, జీఎంఆర్ కేర్ ఆసుపత్రి క్యాజువాలిటీ విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యంబ, నాబార్డు డీడీ ఎం.నాగార్జున పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

బొండపల్లి: గ్రామాల్లోని ప్రతి మహిళకు ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిశుభ్రతపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామైక్య సంఘాల వీఓఏలపై ఉందని వీవోఏల సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వి.సరిత తెలిపారు. మంగళవారం బొండపల్లి వెలుగు కార్యాలయంలో మండలంలోని 31 గ్రామాల్లోని వీఓలకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళా ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఆరోగ్యం, పరిశరాలు పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఇందిర, ఎఫ్‌పీవో వెంకటరమణ, వెలుగు ఏపీఎం కే.సులోచనాదేవి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించి పనులు ప్రారంభించండి



ఆర్డీవోతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నెల్లిమర్ల: రైతుల సమస్యలు పరిష్కరించేంత వరకు కోరాడపేట గ్రామ పరిధిలో తారక రామ తీర్థ సాగర్ రిజర్వాయర్ పనులు చేపట్టవద్దని ఆ గ్రామ ముంపు బాధిత రైతులు, గ్రామస్థులు విజయనగరం ఆర్డీవో ఎంవీ సూర్యకళకు స్పష్టం చేశారు. మండలంలోని సారిపల్లి వద్ద కొనసాగుతున్న తారకరామ రిజర్వాయర్ నిర్మాణం కోసం దన్నానపేట పంచాయతీ మధుర గ్రామం కోరాడ పేట గ్రామాన్ని ప్రభుత్వం ముంపు గ్రామంగా ప్రకటించింది. ఆ గ్రామస్థులకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేసింది. అయితే ఆ గ్రామ భూములకు నష్టపరి హారం చెల్లించిన ప్రభుత్వం ఇళ్ల విలువకు సంబంధించి నష్టపరిహారం చెల్లింపు వేయ లేదని, బాధిత కుటుంబీకులకు జీవన భృతి చెల్లించలేదని, నిర్వాసిత గ్రామాన్ని నిర్మించేందుకు ఉద్దేశించిన నెల్లిమర్లలోని స్థలంలో పట్టాలు పంపిణీ చేయలేదని రైతులు గతంలో రిజర్వాయర్ పనులను అడ్డగించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో సూర్యకళ మంగళవారం కోరాడపేటకు చెందిన ముంపు బాధితులతో మాట్లాడారు.

వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడండి

- సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించిన నాయకులు



ఎల్‌కోట: ఉపాధి కూలీలకు సూపర్ సిక్స్‌పథకాలను వివరిస్తున్న సర్పంచ్



విజయనగరంలో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు, పత్తిగిల్లి సూర్యకుమారి తదితరులు

విజయనగరం రూరల్: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని.. అప్పుడే ఆంధ్రప్రదేశ్‌కు మహర్దశ పడుతుందని విజయనగరం టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 48వ డివిజన్ పరిధిలోని గాజులరేగ, ముత్యాలమ్మపేట, బూడివీధి, రాజవీధి, యాదవ వీధి, శాలివీధి, ఆగురువీధి, పడాల వీధి, మంగలి వీధి, దిగువ వీధి తదితర ప్రాంతాల్లో అదితి గజపతిరాజు పర్యటించారు. ఆ డివిజన్ ఇన్‌చార్జి పత్తిగిల్లి సూర్యకుమారి, మాజీ కౌన్సిలరు ఆల్తి రాధామణి, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారుబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని ఇంటి బాట పట్టించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్లకు సకాలంలో జీతాలు ఇవ్వని దుస్థితి ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు యడ్ల రమణ, కటారి శ్రీను, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

- **లక్కవరపుకోట:** ఖాసాపేట గ్రామ సర్పంచ్ కోల్ల భూపాల్ నాయుడు మంగళవారం చెరువు పనులు చేస్తున్న స్థలానికి చేరుకొని చంద్రబాబు ప్రజల కోసం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళి

రాజాం: శ్యాంపురంలోని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం 20వ వార్డుకు చెందిన 50 ఎస్సీ కుటుంబాలు, వంగర మండలం అరసాడకు చెందిన 20 ఎస్సీ, బీసీ కుటుంబాలు వైసీపీని వీడి.. టీడీపీలో చేరాయి. వీరికి కోండ్రు మురళీమోహన్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎస్సీ విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో పథకాలు అమలు చేస్తే.. వైసీపీ ప్రభుత్వం వాటిని దూరం చేసిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఏకంగా 100 పథకాలు రద్దు చేశారని... అందులో 27 దళితులకు చెందినవని అన్నారు. లావేటి రాము, తోలేటి సన్నిబాబు ఆధ్వర్యంలో యందవ రమేష్, ఎం.వెలంగిని కుమార్, వై.మనోహరరావు, పోలిపల్లి బాబ్జీ తదితరులు టీడీపీలో చేరారు. అరసాడకు చెందిన లచ్చుభుక్త పాదాలు, కడగల ఆదినారాయణ, నందిగాన అప్పలనాయుడు, పారశాని గంగయ్య, రాగోలు త్రినాథరావు తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్ కుమార్, జీఎంఆర్ చంద్రశేఖర్, జరజాన నీలయ్య తదితరులు పాల్గొన్నారు. ● టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తీసుకువచ్చిన మినీ మానిఫెస్టోలో ప్రవేశ పెట్టిన నూతన పథకాలను ప్రజలకు వివరించాలని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ సూచించారు. మంగళవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో రేగిడి మండలం చెలికానివలస, వెంకటంపేట, ఆడవరం, కాగితాపల్లి, పంచాయతీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, ఈ విషయంపై కూడా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, కర్నేని మహేష్, పాలూరి రామినాయుడు. తదితరలు పాల్గొన్నారు.

సైలెన్సర్లను మార్చితే కఠిన చర్యలు



సైలెన్సర్లను తీయించి వాహనదారులను హెచ్చరిస్తున్న ఎస్ఐలు లోవరాజు, ఎస్ .రవి

విజయనగరం క్రైం: జిల్లాలో వాహన దారులు నిబంధనలకు విరుద్ధంగా మోటారు సైకిళ్లకు శబ్ద కాలుష్యం చేస్తున్న సైలెన్సర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్ హెచ్చరించారు. మంగళవారం నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మోటారు సైకిళ్లపై ట్రిపుల్ డ్రైవింగ్, శబ్ద కాలుష్యం సృష్టిస్తున్న వాహనాలను సీజ్ చేసి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సైలెన్సర్లను తొలగించి చలానాలు విధించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐలు లోవరాజు, ఎస్.రవి, ఎఎం రాజు, త్రినాథరావు, సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాల నియంత్రణపై ప్రచారం



మాట్లాడుతున్న రాజాం ఐసీడీఎస్ పీవో

రేగిడి: బాలల హక్కులు, బాల్య వివాహాల అనర్థాలపై విస్తృత ప్రచారం చేయాలని ఐసీడీఎస్ పీవో పి.కనకదుర్గ, ఎంపీడీవో శ్యామలాకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో ఒక్కరోజు చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం గోవిందరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నూకాలమ్మ, అమ్మన్నమ్మ, శశికళ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యగిరి జాతరకు సన్నాహాలు



మాట్లాడుతున్న రామకృష్ణ

శృంగవరపుకోట: శృంగవరపుకోట రెవెన్యూ కార్యాలయంలో మంగళ వారం పుణ్యగిరి మహా శివరాత్రి జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో తహసీల్దార్ కిరణ్ కుమార్ సమన్వయ సమావేశం నిర్వహించారు. స్థానిక దేవి గుడి కూడలి నుంచి పుణ్యగిరి కొండపై వరకు ఐదు ప్రదేశాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఈవో నాగేంద్ర తెలిపారు. ఉచిత ప్రసాద పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తాత్కాలిక మరుగు దొడ్లు, పుట్టధార వద్ద స్నానపు ఏర్పాట్లు, విద్యుత్ సదుపాయం, క్యూ లైన్లు, పది సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎస్.ఐ. గంగరాజు తెలిపారు. జాతర ముగిసే వరకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామని సంబంధిత అధికా రులు చెప్పారు. భక్తులకు వైద్య సేవలు అందిస్తామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. సమావేశంలో కమిటీ చైర్మన్ రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సర్వే ఎందుకో?

సచివాలయ సిబ్బంది ప్రశ్నలతో చిరు వ్యాపారుల బెంబేలు

జామి: 'అమ్మా... మీ షాప్ ఎప్పుడు పెట్టారు? ఎప్పుడైనా జీఎస్టీ కట్టారా? ఈ నెంబర్ ఎప్పుడైనా తీసుకున్నారా? మీ రోజు వారీ అమ్మకం ఎంత.. మీకు ఎంత కరెంటు బిల్లు వస్తుంది?' ఇవీ మంగళవారం మండల కేంద్రమైన జామిలో సచివాలయ సిబ్బంది చిరు వ్యాపారులను అడిగిన ప్రశ్నలు. వారు ఇచ్చిన సమచారం తమ సెల్‌ఫోన్‌లో ఉన్న ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఇది చూసిన వ్యాపారులు ఆందోళన చెందారు. అసలు సర్వే ఏంటని ప్రశ్నిస్తే... ఇది మామూలే అంటూ సచివాలయ సిబ్బంది బదులిచ్చారు. దీని వెనుక ఉన్న కథను ఆరా తీయగా... ఇది కేంద్ర ప్రభుత్వం చేయిస్తున్న సర్వే అని... మరిన్ని వాణిజ్యపరమైన దుకాణాలను జీఎస్టీ పరిధిలోకి తెచ్చి ఆదాయం పెంచేందుకు ఈ సర్వే జరుగుతున్నట్టు తెలిసింది. ఈ సర్వే కోసం కొంతమంది సిబ్బందికి కొద్దిరోజుల క్రితం విజయనగరంలో నాలుగు రోజుల శిక్షణ ఇచ్చినట్టు తెలిసింది. ఇదంతా చూసిన చిరు వ్యాపారులు వివరాలు తీసుకొని ఏం చేస్తారో అని భయపడుతున్నారు. దీనిపై ఓ సచివాలయ ఉద్యోగిని వివరణ కోరగా.. ఇది సాధారణ సర్వే అని చెప్పి వెళ్లిపోవడం గమనార్హం.

ప్రణాళికతో ముందుకు సాగండి

- జేఎన్‌టీయూ వీసీ వెంకట సుబ్బయ్య



మాట్లాడుతున్న వీసీ

విజయనగరం రూరల్: ఇంజనీరింగు విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ వెంకట సుబ్బయ్య చెప్పారు. 12వ జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం ముగింపు కార్యక్రమం మంగళవారం కళాశాల సెమినార్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ సింపోజియంలో వివిధ అంశాలను అవగాహన చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీకుమార్, మెకానికల్ విభాగం హెడ్ నీలిమాదేవి, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు శ్రీనివాస ప్రసాద్, వి.మణికుమార్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు కె.బాలాదిత్య, కె.జ్ఞాన శరణ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ ప్రారంభం



పూజలు చేస్తున్న భక్తులు

రామభద్రపురం: కొత్తరేగలో మంగళవారం ఉమామహేశ్వర ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్తవలసకు చెందిన పూజారి ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రాజ్‌కుమార్

కొత్తవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జడ్పీ సీఈఓ కె.రాజకుమార్ తనిఖీ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల పరిషత్ ద్వారా నిర్వహించిన పనులను ఆయన తనిఖీ చేశారు. అధికారులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. కొత్తవలస వారపు సంత వేలం పాట, జడ్పీకి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్సు, సంత మార్కెట్ స్థలం విషయమై చర్చించారు. ఎంపీడీవో ఎస్. రమణయ్య, పీఆర్ డీఈ సీహెచ్ స్వామినాయుడు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, మహిళలు

విజయనగరం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ అధికారి పి.నరేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో పింక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి కూడలి నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

పోలీసు బలగాల కవాతు

నెల్లిమర్ల, మార్చి 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం నెల్లిమర్లలో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్ఐ రామగణేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కవాతను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. స్థానిక రామతీర్థం జంక్షన్ నుంచి మొయిద జంక్షన్ మీదుగా జరజాపుపేట వరకు కేంద్ర పోలీసు బలగాలతో ర్యాలీ సాగింది. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించొద్దని ఎస్ఐ కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలన్నారు.

జాతీయ పోటీల్లో పతకాలు

విజయనగరం క్రైమ్: జాతీయ స్థాయి 44వ మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న వి.కృష్ణంనాయు డు 3 బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. కృష్ణంనాయుడును మంగళవారం ఎస్పీ దీపిక అభినం దించారు.

గోతులు.. గతుకులు

ప్రమాదకరంగా విశాఖ-అరుకు ప్రధాన రహదారి



ప్రమాదకరంగా తయారైన రహదారి

శృంగవరపుకోట రూరల్: ప్రతినిత్యం వేలాదిమంది పర్యాటకులు, అధిక సంఖ్యలో ప్రయాణంచేసే విశాఖ-అరుకు రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. చాలా చోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఈరోడ్డును అన్ని విధాలా పర్యాటకులకు, వాహనచోదకులకు అత్యంత భద్రతగా ఉంచాల్సిన రహదారులశాఖ పట్టనట్లు వ్యవహరించడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. రాత్రివేళ ఈరోడ్డుపై ప్రయాణం చేయడానికి అందరూ భయపడే పరిస్థితి ఉంది. ఈరోడ్డు నిర్వహణ చేయాల్సిన కాంట్రాక్టర్ రెండునెలల క్రితం ఈరోడ్డుపై ఉన్న గోతులను తూతూ మంత్రంగా కప్పేసి చేతులు దులుపుకోవడంతో ఈరోడ్డు మరోసారి ప్రమాదకరంగా తయారైంది. ఇప్పటికే ఈగోతుల వల్ల చాలామంది మృత్యువాత పడగా, పదుల సంఖ్యలో వాహనచోదకులు క్షతగాత్రులుగా మారారు. ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో ప్రయాణించే ఈ రహదారి ఇలా ఉండటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈరోడ్డు విషయంపై సంబంధితశాఖ డీఈ నరసింహారావు వివరణ కోరగా తాను పరిశీలించి కాంట్రాక్టర్‌తో మాట్లాడుతామన్నారు.

నూర్పిడి యంత్రంలో పడి..

- మహిళ దుర్మరణం

సీతానగరం, మార్చి 5: నూర్పుడి యంత్రంలో పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపురం గ్రామానికి చెందిన కోట్ల రామారావుకు చెందిన పొలంలో మొక్కజొన్న తొలిచే యంత్రంతో నూర్పిడి పనులు చేపడుతున్నారు. ఈ పనులకు గ్రామానికి చెందిన కోట్ల చిన్న (43) కూలీగా హాజరై పనులు చేస్తుంది. ఈ క్రమంలో మంగళవారం పనులు చేస్తుండగా యంత్రంలో చిక్కుకున్న కండెలను తీయడానికి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు యంత్రంలో చీర ఇరుక్కుపోయి, ఆ వేగానికి చీరతో పాటు ఆమె కూడా యంత్రంలోకి చొచ్చుకుపోవడంతో గాయపడింది. గమనించిన తోటి కూలీలు వెంటనే స్పందించి ఆమెను బయటికి తీయగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు గుర్తించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: తెర్లాం పోలీసుస్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు నెమలాం గ్రామానికి చెందిన గొట్టివడ ఈశ్వరరావుకు విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి రెండేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ రమేష్ కుమార్ మంగళవారం తెలిపారు. ఓ గ్రామానికి చెందిన బాలికను ఈశ్వరరావు కిడ్నాప్ చేశాడని తండ్రి తెర్లాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ నవీన్ పడాల్ నిందితుడిని అరెస్టు చేసి న్యాయ స్థానంలో అభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. ప్రస్తుత ఎస్ఐ రమేష్ కుమార్ సాక్షులను, ఆధారాలను న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. నిందితునిపై నేరారోపణలు రుజువు కావటంతో న్యాయమూర్తి కె.నాగమణి.. నిందితుడు ఈశ్వరరావుకు రెండేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తవలస: కొత్తవలస రైల్వేస్టేషన్-తుమ్మికాపల్లి రైల్వేగేటు మధ్యలో పోలీసులు గుర్తు తెలియని మృతదేహాన్ని కనుగొన్నారు. రెండు రోజుల కిందట రైలు ఢీకొని మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. స్థానికంగా విధుల్లో ఉన్న గ్యాంగ్‌మెన్ రైలు పట్టాల పక్కన తుప్పలలో పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి కొత్తవలస రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సమాచారం ఇవ్వడంతో విజయనగరం జీఆర్పీ పోలీసులకు తెలిపారు. ఈ మేరకు జీఆర్పీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.

70 కుటుంబాలు జనసేనలో చేరిక



జనసేనలో చేరిన గూడపువలస గ్రామస్థులు

పూసపాటిరేగ (భోగాపురం): భోగాపురం మండలంలోని గూడపువలస గ్రామానికి చెందిన 70 కుటుంబాలు వైసీపీ నుంచి జనసేనలో ఆ పార్టీ నాయకు డు లోకం ప్రసాద్ ఆధ్వర్యంలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విమానాశ్రయానికి భూమి ఇచ్చిన తమకు ఆర్‌ఆర్ ప్యాకే జీలో అధికార పార్టీ నాయకులు అవకతవకలకు పాల్పడ్డారని, కనీస ఉపాధి, మౌలిక సదుపా యాలు కల్పించలేదని తెలిపారు. ఆనాడు తమకు అండగా నిలిచిన లోకం మాధవికి తామంతా సహకరించేందుకు జనసేనలో చేరినట్లు వీరు తెలిపారు. 8

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

మెంటాడ: గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే తమ పార్టీ పోరాటాన్ని ఉధృతం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. మంగళ వారం మెంటాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనుల రిలే దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. గిరిజ నుల భూసమస్యలపై రిలేదీక్షలు రెండోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిపుత్రులకు చట్టబద్ధ హక్కులను కాపాడాల్సిన అధికార యంత్రాంగం వాటిని హరించే విధంగా వ్యవ హరించడం శోచనీయమన్నారు. కార్పొరేట్ల సేవలో తరించి పేదలను ఇబ్బందుల పాలు చేయడం దుర్మార్గమని విమర్శించా రు. పోడు పట్టాల కోసం ఏళ్లతరబడి పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం అన్యాయమని ఆరోపించారు. సీపీఎం మండల నాయకుడు రాకోటి రాములు మాట్లాడుతూ గిరిజనులకు తమ పార్టీ గిరిజనులకు అండగా ఉంటుందన్నారు. సర్వే జరిపి కూడా గిరిజనులకు సాగు పట్టాలు ఇవ్వక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి గిరిజనులను చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.సోములు మాట్లాడుతూ వైసీపీ నేతల్లో అలజడి మొద లైందని, దీక్షలకు వెళ్లకుండా గిరిజనులను కట్టడి చేస్తున్నారని, వినని వారిని బెదిరిస్తున్నారని ఆరోపించారు.

నిలిచిన తాగునీటి సరఫరా



ఉంగరాడ మెట్టవద్ద రక్షిత పథకం ట్యాంకులు శుభ్రం చేస్తున్న కార్మికులు

రాజాం రూరల్: రాజాం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో మంగళవారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. రేగిడి మండలం ఉంగరాడ మెట్టవద్ద మంచినీటి పథకం నిర్వహణ పనుల వల్ల అధికారులు తాగునీటి పంపింగ్‌ను నిలిపివేశారు. ఫలితంగా సారథి, ఇందిరమ్మ కాలనీ, రాణా వీధి, ఆశపువీధి, కాకర్లవీధి, కొండకవీధి తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా కాలేదు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నిలిపివేయడంతో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. బుధవారం నుంచి తాగునీటి సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు.

రక్షిత పథకాలు శుభ్రం

రాజాం: పురపాలక సంఘ పరిధిలోని రక్షిత పథకాలను కమిషనర్ జె.నారా అప్పలనాయుడు, ఏఈ వెంకటేష్ మంగళవారం శుభ్రం చేయించారు. ఇకపై ప్రతినెల శుభ్రం చేయిస్తామని కమిషనర్ తెలిపారు.

రెండు కులాల పాలన పోవాలి

రాజాం: రాష్ట్రంలో రెండు కులాల పాలన పోవా లని... బహుజన కులాల పాలన రావాలని రాజాం బహు జన సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స బుద్ధుడు అ న్నారు. మంగళవారం బీఎస్పీ కార్యాలయంలో రెండు కు లాల పాలన పోవాలని కరపత్రం ఆవిష్కరించారు.

నేటి నుంచి త్రిమూర్తిశివ జయంతి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం సౌందర్యనారాయణమూర్తి నగర్‌లో మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాయం ఆధ్వర్యంలో 88వ త్రిమూర్తిశివ జయంతి మహోత్సవాలను బుధవారం నుంచి ఈనెల ఎనిమిదో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఓంశాంతి మందిర నిర్వాహకులు బ్రహ్మకుమారీ జ్ఞాన రత్నం ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనం జరుగుతుందని పేర్కొన్నారు.

ఫిజియోథెరపిస్ట్ పోస్టుకు దరఖాస్తులు

పార్వతీపురం-ఆంధ్రజ్యోతి: స్థానిక భవితకేంద్రంలోఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్ట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త జి.పగడాలమ్మ మంగళవారంఒకప్రకటనలో తెలిపారు. షైర్ బేసిస్ లేదా అవర్‌బేసిస్‌లో పనిచేయడానికి ఇంటర్‌తో పాటు బీపీటీ లేదా ఎంపీటీఅర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని, స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.12 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. ఫిజియోథెరపిస్ట్‌కు మూడు మండలాలు కేటాయిస్తామని, మండలానికి నాలుగు క్యాంపులు చొప్పున నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల ఏడో తేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

చిరుధాన్యాలు సాగు చేయాలి

భామిని: పత్తిపంటను తగ్గించి చిరు ధాన్యాలను సాగుచేయాలని వెలుగు స్వచ్ఛంద సంస్థ రిసోర్స్‌పర్సన్ నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం సన్నాయిగూడలో ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరిపంట ప్రకృతి వ్యవసాయంతో చేసే విధానం, లాభాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఏరియా కో-ఆర్డినేటర్ గోపాలరావు, రామారావు, జగ్గయ్య, రమేష్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

రక్తహీనతపై దృష్టి సారించాలి: ఎంపీడీవో


గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న జగదీష్

గరుగుబిల్లి: రక్తహీతనపై గ్రామస్థాయిలో వైద్య సిబ్బందితో పాటు మహిళా శిశు సంక్షేమశాఖ సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని తోటపల్లి, సంతోషపురం, ఉల్లిభద్ర, తదితర సచివాలయాల్లో పదేళ్లలోపు పిల్లల మరణాల రేటు నివారణ కార్యక్రమంపై వైద్య, మహిళా శిశు సంక్షేమశాఖ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు నివారణ, రక్తహీనత నివారణపై దృష్టి సారించాలన్నారు.సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, పంచాయతీకార్యదర్శులు ఉప్పల పెదకోటేశ్వరరావు, చింతల వెంట కుమిరినాయుడు, సూరు శ్రీనివాసరావు, నీరస రవికుమార్ పాల్గొన్నారు.

●**గుమ్మలక్ష్మీపురం:** గిరిజన గ్రామాల చిన్నారుల్లో రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.జగదీష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని డుమ్మంగి, కుక్కిడి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన కన్వర్జెన్సీ సమావేశాల్లో మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ కార్యదర్శులు వేసవిలో చిన్నారుల్లో రక్తహీనత సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు చెందిన సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఏడాదిలోపు చిన్నారులను దత్తత తీసుకొని వారి బాగోగులు చూడాలన్నారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది, భద్రగిరి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

●**సీతానగరం:** రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు బాలింతలు గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పేర్లు నమోదు చేయించాలని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తెలిపారు. పెదభోగిల సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో కేకే కుమార్ వర్మ, ఈఓ జి.వెంకటరమణ పాల్గొన్నారు.

కత్తులకవిటి పాఠశాల స్నాతకోత్సవం


హీరో సుమన్‌ను సన్మానిస్తున్న కత్తులకవిటి గ్రామస్థులు

వీరఘట్టం: మండలంలోని కత్తులకవిటి జడ్పీ ఉన్నతపాఠశాల స్నాతకోత్స వం నిర్వహించారు. ఈసందరంగా సినీనటుడు సుమన్ మాట్లాడుతూ పాఠ శాలలకు మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని, గ్రామస్థులు కూడా తమ వంతు సహకారంతో అభివృది చేస్తున్నందుకు సంతోషదాయకమన్నారు.అనంతరం గేదెల దామోదరరావు రెండు లక్షల 50 వేల రూపాయలతో నిర్మించిన సైకిల్‌షెడ్‌ను ప్రారంభించారు. పాఠశాలకు 20 కంప్యూటర్లను అందిస్తున్నట్టు దామోదరరావు తెలిపారు.అనంతరం సుమన్‌ను గ్రామస్థులు గేదెల దామోదరరావు, కుటుంబసభ్యులు సన్మానించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం పి.సుధారాణి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో ఐదో షెడ్యూల్ ప్రాప్తికి గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను నేరుగా భర్తీ చేయాలని హైకోర్టు తీర్పువెల్లడించడం పట్ల గిరిజన జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక ఉమా మహేశ్వర రావు హర్షంవ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నప్పటికీ గిరిజన నిరుద్యోగులకు ఎటువంటి న్యాయం జరగడం లేదన్నారు. ఇప్పటికైనాఈ అంశంపై గిరిజన అభ్యర్థులు మేలుకోవాలని ఆయన కోరారు.

బిజూ పట్నాయక్‌కు నివాళి


బిజూ పట్నాయక్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న భాస్కరరావు

రాయగడ: రాయగడలో బిజూ పట్నాయక్ 108వ జయంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, తన అనుచరులతో ర్యాలీగా వెళ్లి బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేడీలో చేరిన వారికి కండువావేసి ఆహ్వానించారు. ఆ పార్టీ నాయకుడు, రాయగడ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు వై. వెంకటేశ్వరరావు (కొండబాబు) ఆధ్వర్యంలో బిజూపట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాయగడలో పంచాయతీ దివస్

రాయగడ: స్థానిక జిల్లా పరిషత్తు సమావేశ హాలులో కలెక్టర్ మనోజ సత్యవాన్‌మహాజన్ అధ్యక్షతన పంచాయతీరాజ్ దివస్‌ను నిర్వహించారు. ముఖ్యమంత్రి బిజూపట్నాయక్ జయంతిని పురస్కరించుకుని ఏటా మార్చి ఐదో తేదీన రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ దివస్‌గా పాటిస్తోంది. ఈ సందర్భంగా జడ్పీ అధ్యక్షురాలు సరస్వతీమాఝి పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి, గ్రామా భివృద్ధికి బిజూ పట్నాయక్ చేసిన సేవలను కొనియాడారు. ఉత్తమ పంచాయతీ ప్రతినిధులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మకరంద ముదిలి పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సత్యవాన్, సరస్వతి

వైసీపీకి బుద్ధిచెప్పాలి

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం


మక్కువ: టీడీపీ కండువావేసి ఆహ్వానిస్తున్న గుమ్మడి సంధ్యారాణి

రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

ప్రజలను ఆదుకుంటాం: విజయచంద్ర

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: టీడీజీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామని ఆయా పార్టీల పార్వతీపురం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర తెలిపారు. మంగళవారం పార్వతీపురం మునిసిపాలిటీలోని తొమ్మిదో వార్డులోగల విజయరామరాజు కాలనీ సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డికరుణ, టీడీపీ పట్టణాధ్యక్షుడు గుంట్రెడ్డి రవికుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి మజ్జి వెంకటేష్, నాయకులు పోలా సత్యనారాయణ, కోలా మధుసూదనరావు, పాలకొండ రాజశేఖర్ కోలా శ్రీను పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిర్వహించాలి..

మునిసిపాలిటీలోని తొమ్మిదోవార్డులో తక్షణమే పారిశుధ్య పనులు నిర్వహించాలని పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ-జనసేన అభ్యర్థి బోనెల విజయచంద్ర కోరారు. వార్డులో పర్యటనలో భాగంగా పారిశుధ్య దుస్థితిని పరిశీలించి ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మురుగు నీరు జనావాసాల్లో నిల్వ ఉన్నా చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు.

● **పార్వతీపురం రూరల్:** రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని విజయచంద్ర తెలిపారు. మండలంలోని టేకులోవ, బిత్తరటొంకి తదితర గిరిజన గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోనుదేవిచంద్రమౌళి, గొట్టాపు వెంకటనాయుడు, చంద్రమౌళి, గంట సాయి, రామకృష్ణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.


పార్వతీపురం మునిసిపాలిటీలో తొమ్మిదో వార్డులో మురుగునీటి చుపిస్తున్న విజయచంద్ర

సైకోపాలన పోవాలి: సంధ్యారాణి

మక్కువ: సైకోపాలన పోయి సైకిల్‌పాలన రావాలని సాలూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. మండలంలోని సిబిల్లి, పెద్దవలసలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ హయాంలో గిరిజన గ్రామాలాభివృద్ధి శూన్యమన్నారు. తమ ప్రభుత్వం హయాంలో గిరిజనులకు అందించిన సబ్సిడీ వ్యవసాయ పరికరాలను సైతం వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం భూస్థాపితం ఖాయమన్నారు. ఐటిడీఏ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ అనంతరం గ్రామ వీధుల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు.

వంద కుటుంబాలు టీడీపీలో చేరిక..

సిబిల్లి, పెద్దవలస పంచాయతీ నుంచి మాజీ సర్పంచ్ తీళ్ల కిరణ్ తదితరవంద కుటుంబాలు టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి సంధ్యారాణి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు గేదెల రిషవర్దన్, ప్రధాన కార్యదర్శి బి.గౌరీశంకర్, వేమల చిన్నారావు, డాక్టర్ విమలేశ్వరరావు పాల్గొన్నారు.


గజపతినగరం: జయహో బీసీ కార్యక్రమానికి వెళ్లిన కేఏ నాయుడు


గరుగుబిల్లి: బీసీ సదస్సుకు వెళ్లిన టీడీపీ ప్రతినిధులు

'జయహో బీసీ సదస్సు'కు తరలివెళ్లిన నాయకులు

ఉమ్మడి జిల్లా నుంచి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు గుంటూరు జిల్లా మంగళగిరిలో మంగళవారం జరిగిన బీసీ జయహో సదస్సుకు తరలివెళ్లారు. గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు, కొప్పలవెలమ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ అల్లు విజయ్‌కుమార్, అరకు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బి.రామ్మోహనరావు వెళ్లారు.

రైతులకు పరికరాల పంపిణీ



గిరిజన రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తున్న అధికారులు

సీతంపేట: సీతంపేట ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలో ఉన్న వీరఘట్టం, సీతంపేట మండలాలకు చెందిన గిరిజన రైతులకు ఉచితంగా వ్యవసాయ పరికరాలు అందించామని శాస్త్రవేత్త డాక్టర్ పి.సీతారాం మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ఉచితంగా అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ, ప్రాజెక్టు వ్యవసాయాధికారి హరికృష్ణ, ఉద్యానవనాల అధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత

జాతీయ, రాష్ట్రస్థాయిల్లో హాకీ,వాలీబాల్, ఆర్చరీలో ప్రతిభకనబరిచిన 20 మంది ఉత్తమ క్రీడాకారులకు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి క్రీడా పరికరాలను అందించారు. పరికరాలను గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో భద్రపరిచి క్రీడాకారులకు అందు బాటులో ఉండేలా చూసుకోవాలని స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్‌కు పీవో సూచించారు.

చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదు

● మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు

జియ్యమ్మవలస: తనపై కొంతమంది వైసీపీ నాయకులు చౌకబారు విమర్శలు చేయడం తగదని, దీని వెనుక కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఉన్నట్లు అనిపిస్తోందని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ కోర్ కమిటీ సభ్యులు నిమ్మక జయరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారులను భయపెట్టి అర్నాడ గ్రామానికి రోడ్డు వేయకుండా చేస్తున్నానని కొందరు వైసీపీ నాయకులు వాట్సాప్‌లో ట్రోలింగ్ చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు. కేవలం రాజకీయ కక్షతో ఇలాంటి విమర్శలు చేస్తున్నారన్నారు. అర్నాడ గ్రామానికి రోడ్డు మంజూరైందని, శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దానిని పూర్తి చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్నామని చెబుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తున్న నిధులు కేంద్ర ప్రభుత్వానివో ...కాదో ప్రజలకు తెలియజేయాలన్నారు. నిధులిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ పేరును ఎక్కడైనా ప్రస్తావిస్తున్నారా అని ప్రశ్నించారు.

పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభం

జియ్యమ్మవలస: చినమేరంగిలో రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ ఆఫీసు నూతన భవనాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర మంగళవారం ప్రారంభించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో స్పెషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ నిధులు దీని కోసం మంజూరయ్యాయి. భవన నిర్మాణం పూర్తవ్వడానికి నాలుగున్నరేళ్లు పట్టింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సీతానగరం: బూర్జ, వెంకటాపురం, కృష్ణరాయపురంల్లో పోలింగ్ కేంద్రాలను ఈవోపీఆర్‌డీ వర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల గురించి ఆరాతీశారు.

చంద్రబాబు దృష్టికి నియోజకవర్గ సమస్యలు


మాట్లాడుతున్న వీరేష్ చంద్రదేవ్

గరుగుబిల్లి : కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సమస్యలను పార్టీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ తెలిపారు. మంగళవారం మండలంలోని చిలకాంలో అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు ఎం.శశికుమార్, వెంకటనాయుడు, రమణమూర్తి, గౌరీశంకరరావు, అనిల్, దాలినాయుడు, బి.నారాయణస్వామి, కె.బలరాంనాయుడు, పి.మోహనరావు, జనసేన పార్టీ ప్రతినిధులు వి.శివకుమార్, టి.శ్రీరాములునాయుడుతో పాటుఐదు మండలాల నుంచి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కురుపాంలో ఏకలవ్య పాఠశాల ప్రారంభం

కురుపాం: కురుపాంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, కురుపాంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఏ పాముల పుష్ప శ్రీవాణి, విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

●సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ



గజపతినగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

గజపతినగరం: పురిటిపెంట పంచాయతీ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం గజపతినగరంలో మెయిన్ రోడ్డులో ర్యాలీచేసి చెత్తకుప్ప వద్ద పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనాలు పెంచాలని ఐదురోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకనే నాథుడే లేరన్నారు. రోజుకు చెల్లించే రూ.300ల కూలీతో దినసరి వేతనం సరిపోక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేతనాలు పెంచడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ అలవెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోమాంసం విక్రయంపై చర్యలు తీసుకోండి

● ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

గంట్యాడ: గ్రామాల్లో గో మాంసం విక్రయిస్తున్నవారిపై కేసులు నమోదు చేయాలని ఏపీ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ కోరారు. మంగళవారం గంట్యాడలో తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా తిరిగి గో మాంసం ప్యాకెట్లతో విక్రయిస్తున్నారని తహసీల్దార్ వివరించారు. గ్రామాల్లో దండోర వేయించి గోమాంసం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలోని ఆ సంస్థ జిల్లా మహిళాఅధ్యక్షురాలు చోళ్ళ రాజకుమారి, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, పైడితల్లి పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఐసీడీఎస్ పీవో ఆరుద్ర ఆధ్వర్యంలో బాల్య వివాహాలు నిర్మూలన, బాల్య వివాహాల నిరోధక కమిటీ ఏర్పాటుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుద్ర మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉంటారని తెలిపారు. పంచాయతీ పరిధిలో సర్పంచ్ చైర్మన్‌గా తొమ్మిది మందితో కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఏపీవో నారాయణరావు, సూపర్‌వైజర్ శకుంతల, జడ్పీటీసీ సభ్యులు శీర అప్పలనాయుడు, వైస్ఎంపీపీ తోట తిరుపతిరావు, పొట్నూరు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

అమృత ఆహారాన్ని తీసుకోండి

పార్వతీపురంటౌన్: మానవుడు శక్తివంతుడుగా, సంపూర్ణంగా జీవించాలంటే అమృత ఆహరం(అప్పుడే సేకరించిన కాయగూరలు) తీసుకోవాలని వైద్యుడు డి.రామ్మోహనరావు తెలిపారు. మంగళవారం పార్వతీపురంలోని అమృత నివాసం వద్ద ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

మెంటాడ: పెదమేడపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఆంద్ర ఎస్ఐ బొడ్డు దేవి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పారమ్మతల్లికి పుష్పాలంకరణ

సాలూరు రూరల్: పాచిపెంట మండలంలోని చెరుకుపల్లిలోగల పారమ్మతల్లికి మాఘమంగళవారం దశమి పురస్కరించుకుని గులాబీ పువ్వులతో పుష్పాలంకరణలో నిజరూపం దర్శనంఇచ్చారు. అమ్మవారికి నిత్యం చీరతో అలంకరిస్తారు. మాఘ మంగళవారం సందర్భంగా అమ్మవారి నిజరూప దర్శనానికి గులాబీలతో పుష్పాలం కరణ చేశారు. అమ్మవారిని పలువురు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసినట్లు సనాతన ధర్మపరిషత్ అధ్యక్షుడు కొలకోటి శంకరరావు చెప్పారు.

విద్యార్థుల మరణాలు నివారించాలి

సాలూరు రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల మరణాలు నివారణకు వైద్య సిబ్బందిని నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కమిటీ అధ్యక్షుడు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి కోలక రంజిత్‌కుమార్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈమేరకుగవర్నర్,హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మానవహక్కుల సంఘ ఛైర్మన్‌కు వినతిపత్రాలు పంపినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆదివాసీ ఆరోగ్యం పేరుతో వైద్యసిబ్బందిని నియమించిందని తెలిపారు. ప్రస్తుతం ఇదే విధానాన్ని కొనసాగించి గిరిజన విద్యార్థుల మరణాలను నివారణకు చర్యలు చేపట్టేలా చొరవ చూపాలని వారిని కోరినట్లు పేర్కొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: తమ గ్రామాలకు పక్కా రహదారులు నిర్మించాలని సురక్షితమైన తాగునీరందించాలని కొమరాడ మండలం రెబ్బ, వనధార గిరిజన గ్రామాల యువకులు కోరారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ సంఘ నాయకులు పాలక రంజిత్‌కుమార్‌తోపాటు ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందించారు.